ఆంధ్రప్రభ

# సెప్టెంబర్ 30 వరకు జన సురక్ష

- 774 గ్రామ పంచాయతీల్లో కార్యక్రమం
- కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి : కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి ప్రతినిధి (ఆంధ్రప్రభ):** జిల్లాలో జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిర్వహించనున్న గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాలోని 774 గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమం చేపడు తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామస్థాయి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల గురించి అవగాహన కల్పించి, వాటిని సద్వినియోగం చేసుకునేలా చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం జెడీవై రీ-కేవైసీ వంటి పథకాల గురించి ప్రజలకు వివరించి, ఖాతా తెరవడం, కేవైసీ ప్రక్రియలను పూర్తి చేయడం ఈ కార్యక్రమంలో భాగమని పేర్కొన్నారు.



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

## పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకానికి 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగి బ్యాంకు ఖాతా కలిగిన వారందరూ అర్హులని, ఈ వయసుగల వారందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. కేవలం రూ.436 లతో రూ. 2 లక్షల వరకు జీవిత బీమా సౌకర్యం ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన ద్వారా లబ్ధి పొందవచ్చునని అన్నారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనకు 18 నుంచి 70 ఏళ్లు వయస్సు కలిగి బ్యాంకు ఖాతా కలిగిన వారందరూ ఈ పథకానికి అర్హులని, కేవలం రూ.20 తో రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. అటల్ పెన్షన్ యోజన ఈ పథకం 18 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులని వయసును బట్టి ప్రీమియం నిర్ధారించబడు తుందన్నారు. 60 ఏళ్లు పూర్తయిన తర్వాత నెలకు రూ.1000 నుంచి రూ.5000 వరకు చెల్లించబడునని అన్నారు. పీఎం జేడీవై రీ - కేవైసీ, పీఎం జేడీవై పొదుపు ఖాతాలు 10 ఏళ్లు పూర్తయినవి రీ-కేవీసీ చేయించుకోవాలన్నారు.

## సైబర్ నేరాలు అవగాహన

సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో లబ్ధిదారులు ఓటీపీలు, లింకులపై క్లిక్ చేయడం వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పథకాల ద్వారా అందే నగదు లబ్ధిదారుల ఖాతాలో జమ అయిన తర్వాత సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరాలపై అవగాహనతో ఉండాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.